సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 30 । అక్టోబర్ । 2024



కొంటారా.. వదిలేస్తారా?!
ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించి నష్టపోతున్నారు. 8లో



కలెక్టరేట్ ఎదుట ఆందోళన
ట్రైకార్ నిధులు విడుదల చేయాలని గిరిజనులు, సమస్యలు పరిష్కరించాలంటూ ఏఈఓలు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 23°

వాతావరణం
జిల్లాలో బుధవారం ఉదయం నుంచే ఎండ ప్రారంభమై మధ్యాహ్నానికి తీవ్రమవుతుంది. రాత్రికి చలి ప్రభావం కనిపిస్తుంది.

అడ్డాల్లేక అవస్థలు





కొత్తగూడెం సూపర్ బజార్ వద్ద జాతీయ రహదారిపై అండర్ బ్రిడ్జి సమీపాన దీపాల అమ్మకాలు (ఇన్‌సెట్) పాల్వంచలో రోడ్డుపైనే ప్రమిదల విక్రయాలు..

పండగల సందర్భంగా ప్రత్యేకంగా జరిగే క్రయవిక్రయాల విషయంలో జిల్లాలోని మున్సిపల్, స్థానిక సంస్థల పాలకవర్గాలు, అధికారుల వద్ద సరైన ప్రణాళిక లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వినాయక చవితికి వెలగకాయలు, గరిక, పత్రి, దసరా సమయంలో బతుకమ్మ పూలు, శివరాత్రికి కందమూలలు, గరిక.. ఇలా ప్రతీ పండగ సందర్భంగా ఆ ప్రత్యేక రోజులను పురస్కరించుకుని పూజలు, వ్రతాల్లో వినియోగించే వస్తువులు అమ్ముతుంటారు. ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలే పల్లెల నుంచి సరుకులను పట్టణాలకు తీసుకొచ్చి పండగకు నాలుగైదు రోజుల ముందు నుంచి అమ్ముతుంటారు. రోడ్ల పైనే అమ్మకాల కారణంగా ఇటు చిరువ్యాపారులు, అటు పట్టణ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. –సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

పండగ సమయాల్లో రహదారులే మార్కెట్లు
- గరిక, దీపాలు, పూలు, బొమ్మల విక్రయాలు
- 'ప్రత్యేక మార్కెట్ల'తో తప్పని ట్రాఫిక్ ఇబ్బందులు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై అధికారుల్లో కనిపించని శ్రద్ధ

ఎండలోనే క్రయ విక్రయాలు..
పండగల సందర్భంగా చిరువ్యాపారాలు చేసే వారిలో మహిళలే అధికం. రోడ్డు పక్కన కనీసం నీడ లేకుండా ఎండలోనే వ్యాపారాలు చేస్తుంటారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తమ కుటుంబ అవసరాల కోసం కొంత సొమ్ము సంపాదిస్తుంటారు. కనీసం తినడానికి కూడా సరైన వసతి ఉండదు. వాష్‌రూమ్ వంటి సౌకర్యాలు అసలే ఉండవు. మరోవైపు ఇలాంటి చిరువ్యాపారులకు ఇటు మున్సిపల్ సిబ్బంది, కాంట్రాక్టర్లు, అటు ట్రాఫిక్ సిబ్బంది నుంచి మామూళ్ల గోల తప్పదు. ఇక పూజా వస్తువులు కొనేందుకు కుటుంబంతో సహా వచ్చిన వారికి తమ వాహనాలు మెయిన్‌రోడ్డుపై నిలపడం అతి పెద్ద సమస్యగా మారింది. ఒకవేళ వాహనం నిలిపినా ప్రశాంతంగా దేవుడి వస్తువులు కొనుగోలు చేసే పరిస్థితి ఉండడం లేదు. రణగొణ ధ్వనులు, భారీ వాహనాల రాకపోకల మధ్య సంతృప్తి లేకుండానే పండగ సామగ్రి కొనుక్కోవాల్సి వస్తోంది.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లేవి..?
20, 30 ఏళ్ల క్రితం ఇలా ప్రధాన రహదారుల పక్కన తాత్కాలిక అమ్మకాలు జరిపితే ప్రజలకు ఉపయోగకరంగా ఉండేది. కానీ పెరిగిన వాహనాల రద్దీతో పాత పద్ధతి ఇబ్బందికరంగా మారింది. పండగల సమయంలో తాత్కాలిక మార్కెట్ల ఏర్పాటుపై పుర పాలక సంఘాలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఉదాహరణకు కొత్తగూడెంలో రామచంద్ర స్కూల్ పక్కన మున్సిపల్ స్థలం ఖాళీగా ఉంది. ఇల్లెందులో సింగరేణి ప్రధాన కార్యాలయం (ఓల్డ్), భద్రాచలంలో ఐటీడీఏ రోడ్డులో గ్రౌండ్ అందుబాటులో ఉన్నాయి. పండగల సందర్భంగా ప్రత్యేకంగా అమ్మకాలు జరిపే వస్తువుల కోసం తాత్కాలిక మార్కెట్లు ఏర్పాటు చేస్తే ఇటు చిరు వ్యాపారులకు, అటు కొనుగోలుదారులకు సౌకర్యంగా ఉంటుంది. మరోవైపు ట్రాఫిక్ చిక్కులు కూడా తప్పుతాయి.

అనుమతి లేకుండానే టపాసుల అమ్మకాలు..
రెవెన్యూ, పోలీసు, ఫైర్, స్థానిక సంస్థలు ఇలా కీలక విభాగాల నుంచి అనుమతి వచ్చిన తర్వాతే బాణాసంచా అమ్మకాలు సాగించాలి. కానీ ఒక్క విభాగం నుంచి కూడా అనుమతులు తీసుకోకుండానే టపాసుల విక్రయాలు ప్రారంభించినా ప్రభుత్వ విభాగాల నుంచి ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కావడం లేదు. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని అయినా బాణాసంచా విక్రయాల దగ్గర ఫైర్ సేఫ్టీని కట్టుదిట్టం చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. మొక్కుబడిగా ఇసుక బకెట్లతో సరిపెట్టకుండా బాణాసంచా విక్రయ కేంద్రాల వద్ద ఫైర్ ఇంజన్లు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

రహదారులపైనే వ్యాపారం..
జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్ వరకు అండర్ బ్రిడ్జి కింద మూల మలుపులో మట్టి దీపాలు, బొమ్మల కొలువులో ఉంచే మట్టి బొమ్మలు ఇతర పూజా సామగ్రి అమ్మకాలు మూడు రోజుల క్రితం ప్రారంభమయ్యాయి. వీటిని కొనుగోలు చేసేందుకు వస్తున్న పట్టణ ప్రజలు అండర్ బ్రిడ్జి నుంచి సూపర్‌బజార్ వరకు రోడ్డుకు ఓ వైపు తమ వాహనాలు నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవతున్నాయి. ఈ తరహా పరిస్థితి కొత్తగూడెంలో సూపర్‌బజార్ దగ్గర, ఇల్లెందులో బుగ్గవాగు, మార్కెట్ల వద్ద, పాల్వంచలో శాస్త్రిరోడ్, మణుగూరులో ప్రధాన రహదారుల వెంట ఉంటోంది.

నేత్రపర్వంగా రామయ్య నిత్య కల్యాణం

న్యూస్‌రీల్

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని శ్రీ అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, తమలపాకులతో అర్చన గావించారు.

ఉత్తమ స్టేషన్ మేనేజర్‌గా అల్లం నాగేశ్వరరావు



సర్టిఫికెట్ అందజేస్తున్న డీఎం తిరుపతి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఆర్టీసీ డిపోలో స్టేషన్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న అల్లం నాగేశ్వరరావుకు ఖమ్మం రీజియన్ పరిధిలో ఉత్తమ స్టేషన్ మేనేజర్ అవార్డు లభించింది. ఈ అవార్డును భద్రాచలం డిపో మేనేజర్ తిరుపతి మంగళవారం నాగేశ్వరరావుకు అందజేశారు. నాగేశ్వరరావు విధుల పట్ల అంకిత భావంతో పాటు ప్రయాణికులకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి మన్ననలు పొందుతున్నారు. పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో జరిగే ప్రతి కార్యక్రమానికి భక్తులకు అన్ని విధాలా ఆర్టీసీ తరఫున, దాతల సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహించడాన్ని గుర్తించిన సంస్థ ఆయనకు ఉత్తమ స్టేషన్ మేనేజర్ అవార్డు ప్రకటించింది. నాగేశ్వరరావు గతంలో కూడా ఉత్తమ స్టేషన్ మేనేజర్‌గా పురస్కారం అందుకున్నారు.

మెరిట్ జాబితా విడుదల

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో 327 పోస్టుల భర్తీకి ఆగస్టు 6, 7 తేదీల్లో పరీక్ష నిర్వహించగా, మెరిట్ జాబితాను మంగళవారం విడుదల చేశారు. ఇప్పటికే మొదటి నోటిఫికేషన్‌కు సంబంధించిన అభ్యర్థులకు ఈనెల 24 నుంచి ఇంటర్వ్యూలు జరుగుతుండగా, ఆ తర్వాత ప్రస్తుత జాబితాలో అర్హత సాధించిన వారిని ఇంటర్వ్యూ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ జాబితాలో ఎలక్ట్రీషియన్ ట్రెయినీ కేటగిరి –1 పోస్టులు 98, ఫిట్టర్ కేటగిరి–1 పోస్టులు 47, అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రెయినీ 24, అసిస్టెంట్ ఫోర్‌మెన్ 9, జూనియర్ మైనింగ్ ఇంజనీర్ 100 భర్తీ చేయనున్నారు.

6 నుంచి ఇంటింటి సర్వే

కలెక్టర్ జితేష్ వి పాటిల్



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమగ్ర ఇంటింటి సర్వేపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్ని జిల్లాల కలెక్టర్లతో మంగళవారం మధిర తహసీల్దార్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా జిల్లా నుంచి కలెక్టర్ జితేష్ వి పాటిల్ పాల్గొన్నారు. అనంతరం ఆయ అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వచ్చే నెల 6వ తేదీ నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభం అవుతుందని, ఈ ప్రక్రియను పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు సూచించారు. సర్వే నిర్వహణకు అవసరమైన ఎన్యూమరేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించాలని అన్నారు. ఇప్పటికే ఉన్న సర్వే సిబ్బందికి బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించాలని తహసీల్దార్లు, ఎంపీడీఓలను ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్, సీపీఓ సంజీవరావు, డీపీఓ చంద్రమౌళి పాల్గొన్నారు.

ఉపాధి యూనిట్లతో లబ్ధి పొందండి

ఐటీడీఏ పీఓ రాహుల్



టేకులపల్లిలో నాప్కిన్ యూనిట్‌ను పరిశీలిస్తున్న పీఓ రాహుల్

ఇల్లెందురూరల్/టేకులపల్లి : ఐటీడీఏ ద్వారా మంజూరైన స్వయం ఉపాధి యూనిట్లను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని పీఓ రాహుల్ సూచించారు. మంగళవారం ఆయన ఇల్లెందు మండలం మొట్లగూడెంలో గిరిజన మహిళలకు మంజూరైన బ్రిక్స్ యూనిట్‌ను సందర్శించారు. యూనిట్ ధర, ఫ్లైయాష్ బ్రిక్స్ మేకింగ్ మిషన్లు, తయారీ విధానంపై అడిగి తెలుసుకున్నారు. నలుగురు గిరిజన మహిళల స్వయం ఉపాధి లక్ష్యంగా ప్రభుత్వం రూ.15 లక్షల సబ్సిడీతో రూ.25 లక్షలు మంజూరు చేసిందని, ఇందులో రూ.2.50 లక్షలు లబ్ధిదారుల వాటా, రూ.7.50 లక్షలు బ్యాంకు రుణం ఉంటుందని వివరించారు. ఫ్లైయాష్ బ్రిక్స్‌పై విస్తృత ప్రచారం కల్పించి లాభాలు ఆర్జించాలని మహిళలకు సూచించారు. అనంతరం టేకులపల్లి, బోడు గ్రామాల్లో సఖి నాప్కిన్ యూనిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉన్నత విద్యనభ్యసించి ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వశక్తితో కుటీర పరిశ్రమ నెలకొల్పి తమ కుటుంబాలను పోషించుకోవడమే కాక పదిమందికి ఉపాధి కల్పించడం సంతోషకరమని అన్నారు. నిరుద్యోగులైన ఆరుగురు గిరిజన యువతులు రూ.9.90 లక్షల సబ్సిడీతో రూ.16 లక్షల వ్యయంతో యూనిట్ ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఇక్కడ తయారు చేస్తున్న నాప్కిన్లపై అన్ని గ్రామ సమైక్య, మండల సమైక్య సమావేశాల్లో ప్రచారం చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో కిరాణా షాపుల్లోనూ విక్రయించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఏటీడీఓ రాధమ్మ, జేడీఎం హరికృష్ణ, ఏపీఎం దుర్గారావు, ఐకేపీ ఏపీఎం రవికుమార్ పాల్గొన్నారు.

కోర్టు ఉత్తర్వులున్నా కూల్చివేతలా..?



ఇంటిని కూల్చివేస్తున్న దృశ్యం

సింగరేణి (కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని ఎస్‌ఆర్‌టీ కాలనీలో ఓసీ విస్తరణలో భాగంగా ఇళ్లు ఖాళీ చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే తమకు ప్రభుత్వం స్థలం ఇచ్చినా ఇళ్లు నిర్మించుకునే వరకు అవకాశం ఇవ్వాలని, కూల్చివేతలు ఆపాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని, అయినా అధికారులు ఇళ్లు కూల్చివేస్తున్నారని బాధితులు ఆందోళన చెందుతున్నారు. తమ ఇళ్లకు పరిహారం చెల్లించకుండా కూల్చివేయొద్దంటూ 39 మంది కోర్టును ఆశ్రయించగా తాత్కాలికంగా కూల్చివేతలు ఆపాలని ఈనెల 24న కోర్టు ఆదేశాలు జారీ చేసిందని బాధితులు చెబుతున్నారు. అయినా సింగరేణి అధికారులు ఇళ్లు కూల్చివేశారని వాపోయారు. ఈ విషయమై ఏరియా ఎస్టేట్స్ అధికారి తావురియాను 'సాక్షి' వివరణ కోరగా కోర్టు ఆర్డర్ ఉన్న ఇళ్లను కూల్చలేదని, ఖాళీగా ఉన్న ఇంటిని మాత్రమే కూల్చివేశామని తెలిపారు.

పారాలీగల్ వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంటౌన్: ప్రజలకు న్యాయపరమైన సలహాలిస్తూ తగు న్యాయం చేయాలనే ఆలోచన గలవారు పారాలీగల్ వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 20వ తేదీ వరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థకు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. టీచర్లు, రిటైర్డ్ టీచర్లు, విశ్రాంత ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, డాక్టర్లు, లా విద్యార్థులతో పాటు సేవా దృక్పథం గలవారు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. బయోడేటా, గుర్తింపు కార్డు, రెండు స్టాంప్ సైజ్ ఫొటోలు జతచేయాలని, కనీస విద్యార్హత పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని సూచించారు. ఎంపికైన 50 మందికి శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, గౌరవ వేతనం అందజేస్తామని పేర్కొన్నారు.

ఏసీబీకి చిక్కిన వైద్య కళాశాల ఉద్యోగులు

- రూ.3 లక్షలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ డీఎస్పీ
- ఏఓ ఖలీల్, జూనియర్ అసిస్టెంట్ సుధాకర్ అరెస్ట్



ఏసీబీకి పట్టుబడిన ఏఓ, జూనియర్ అసిస్టెంట్

కొత్తగూడెంరూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీకి చెందిన ఇద్దరు ఉద్యోగులు రూ.3 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. ఏసీబీ ఖమ్మం డీఎస్పీ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వైద్య కళాశాలలో 49 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కావాలని కళాశాల ప్రిన్సిపాల్ గతంలో నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ మేరకు ఓ ఏజెన్సీ 49 మంది ఉద్యోగులను కేటాయించింది. వీరితో ఆరు నెలలు పని చేయించుకున్న కళాశాల యాజమాన్యం వేతనాల చెల్లింపులో జాప్యం చేసింది. ఈ విషయమై ఏజెన్సీ నిర్వాహకులు కళాశాల సిబ్బందిని అడగగా.. రూ.15 లక్షలు లంచం ఇస్తేనే బిల్లులు చేస్తామని ఏఓ ఖలీల్, జూనియర్ అసిస్టెంట్ సుధాకర్ చెప్పారు. తాము అంత ఇవ్వలేమని ఏజెన్సీ వారు చెప్పడంతో రెండున్నర నెలల వేతనాలకు సంబంధించిన బిల్లులు చేయడమే కాక, 49 మందిలో 23 మంది ఉద్యోగానికి అనర్హులని, వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నామని ఏఓ, జూనియర్ అసిస్టెంట్ ఏజెన్సీకి లేఖ రాశారు. ఈ క్రమంలో రూ.7లక్షలు లంచం ఇచ్చేలా ఒప్పందం చేసుకున్న ఏజెన్సీ.. ఆ తర్వాత ఏసీబీని ఆశ్రయించింది. వారి సూచన మేరకు ఈ మొత్తంలో రూ.3లక్షలు మంగళవారం, మిగతా రూ.4లక్షలు శనివారం ఇచ్చేలా అంగీకారం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం రూ.3లక్షలు లంచం ఇస్తుండగా ముందుగానే అక్కడికి చేరుకున్న ఏసీబీ డీఎస్పీ రమేష్, సిబ్బంది ఏఓ ఖలీల్, జూనియర్ అసిస్టెంట్ సుధాకర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారిద్దరినీ అరెస్ట్ చేసినట్లు రమేష్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే 1064 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు.

సీసీఐ కేంద్రాల్లోనే విక్రయించండి

- సెంటర్లలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం
- పత్తి రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు
- నిర్దేశిత తేమ శాతం ఉంటే మద్దతు ధర పొందొచ్చు
- 'సాక్షి ఫోన్ ఇన్'లో జిల్లా మార్కెటింగ్ అధికారి నరేందర్

సాక్షి ఫోన్ ఇన్



కొత్తగూడెంఅర్బన్: నెలల తరబడి కష్టం చేసి పండించిన పత్తిని తక్కువ ధరకు అమ్మి మోసపోవద్దని, సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించి లాభాలు పొందాలని జిల్లా మార్కెటింగ్ అధికారి జె.నరేందర్ రైతులకు సూచించారు. సీసీఐ కేంద్రాల్లో రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. దీపావళి తర్వాత జిల్లాలో సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అప్పటి వరకు రైతులు ఓపిక పట్టాలని, ఇళ్ల వద్దకు వచ్చే వారిని నమ్మి అమ్ముకోవద్దని కోరారు. మంగళవారం 'సాక్షి' ఆధ్వర్యంలో చేపట్టిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో జిల్లాలోని పత్తి రైతులు అడిగిన సందేహాలకు ఆయన సమాధానం ఇచ్చారు.

ప్రశ్న: జిల్లాలో సీసీఐ కేంద్రాలు ఎప్పుడు ప్రారంభిస్తారు ?
– పూనెం రమేష్, దుమ్ముగూడెం

జవాబు: జిల్లాలో నాలుగు సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రారంభానికి సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నాం. దీపావళి తర్వాత వచ్చేనెల 4, 5 తేదీల నాటికి కేంద్రాలు ప్రారంభిస్తాం.

ప్రశ్న: కేంద్రాలకు ఏయే ఆధారాలు తీసుకురావాలి?
– చెవుల సర్వయ్య, సింగభూపాలెం

జవాబు: సీసీఐ కేంద్రాల్లో పత్తి అమ్మాలంటే రైతుల ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం తప్పనిసరిగా తీసుకురావాల్సి ఉంటుంది.

ప్రశ్న: ప్రైవేటు మార్కెట్‌లో తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఏం చేయాలి?
– రామారావు, సుజాతనగర్

జవాబు: ప్రస్తుతం పత్తికి 22 శాతం వరకు తేమ ఉంటుంది. దీంతో ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. కోసిన పత్తిని ఆరబెట్టిన తర్వాత సీసీఐ కేంద్రాలకు తీసుకొచ్చి విక్రయించాలి. తేమ శాతం తగ్గితే మద్దతు ధర లభిస్తుంది.

ప్రశ్న: కేంద్రాల్లో సౌకర్యాలు ఉండడం లేవు
– కోళ్ల రాంబాబు, రేగళ్ల

జవాబు: నవంబర్‌లో ప్రారంభించే సీసీఐ కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. ప్రారంభ తేదీలను త్వరలోనే ప్రకటిస్తాం.

ప్రశ్న: పత్తిలో తేమ ఎంత శాతం ఉండాలి ?
– దారావత్ శ్రీకాంత్, సీతంపేట

జవాబు: సీసీఐ కేంద్రాలకు తీసుకొచ్చే పత్తికి 12 శాతం వరకు తేమ ఉండొచ్చు. అంతకంటే ఎక్కువగా ఉంటే కొనుగోలు చేయరు. 8 శాతం వరకు ఉంటే ప్రభుత్వ మద్దతు ధర రూ.7,521 వస్తుంది.

ప్రశ్న: కొనుగోలు కేంద్రాల్లో గతేడాది కంటే ఏమైనా మార్పులున్నాయా?
– కె.సీతయ్య, చంద్రుగొండ

జవాబు: ఈ ఏడాది పత్తి కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. సుజాతనగర్ మండలం దేగలమడుగు, కారేపల్లి మండలం అప్పాయిగూడెం, అశ్వాపురం మండలం నెల్లిపాక బంజార, బూర్గంపాడు మండలం లక్ష్మీపురంలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పత్తి కొనుగోలు చేస్తాం.

ప్రశ్న: బయట తక్కువ ధరకు అడుగుతున్నారు, అమ్మొచ్చా ?
– వెంకటరెడ్డి, బూర్గంపాడు

జవాబు: తక్కువ ధరకు అమ్మి నష్టపోవద్దు. తేమ ఎక్కువగా ఉంటే సీసీఐ కేంద్రాలు ప్రారంభం అయ్యే వరకు ఆరబెట్టండి. ఆ తర్వాత మద్దతు ధర రూ.7,521 చొప్పున అమ్ముకోవచ్చు.

ప్రశ్న: తేమ 22 శాతం ఉంటే కొనుగోలు చేస్తారా ?
– రామచంద్రరావు, చర్ల మండలం

జవాబు: పత్తిలో తేమ శాతం 8 వరకు ఉంటే ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుంది. 12 శాతం వరకు ఉంటే సీసీఐ కేంద్రాల్లో కొనుగోలు చేస్తాం. ఆపైన ఉంటే సీసీఐ కేంద్రాల్లో తీసుకోరు.

ప్రశ్న: జూలూరుపాడులో మార్కెట్ యార్డు ఏర్పాటు చేయండి
– వేల్పుల నర్సింహరావు, జూలూరుపాడు

జవాబు: జూలూరుపాడు మండలంలో నూతన మార్కెట్ యార్డు ఏర్పాటుకు నాలుగేళ్ల క్రితమే ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి నిధుల మంజూరైతే పనులు ప్రారంభిస్తాం.

ప్రశ్న: ప్రైవేట్ వారిపై చర్యలు తీసుకోండి..
– శ్రీను, కొమ్ముగూడెం

జవాబు: ప్రైవేట్ వ్యాపారులు తేమ ఎక్కువగా ఉందని తక్కువ ధరకు కొంటున్నారు. రైతులు జాగ్రత్తపడి, పత్తిని ఆరబెట్టి ఆ తర్వాత సీసీఐ కేంద్రాల్లో విక్రయించండి.

ప్రశ్న: ప్రైవేటు వ్యాపారుల దోపిడీ ఎక్కువైంది.. ఎలా ?
– భూక్యా చంద్రబాబు, జూలూరుపాడు.

జవాబు: ప్రైవేట్ వ్యాపారులు లైసెన్స్ తీసుకొని కొనుగోళ్లు చేయాలి. లేదంటే వారిపై చర్యలు తీసుకుంటాం. టోల్ ఫ్రీ నంబర్ 88972 81111కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు.

ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా విజయకుమార్



మాట్లాడుతున్న డాక్టర్ విజయ్‌కుమార్

కొత్తగూడెంరూరల్: ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా కొత్తగూడెం పట్టణానికి చెందిన పిల్లల వైద్యుడు విజయకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఆయన కొత్తగూడెంలో విలేకరులతో మాట్లాడారు. ఐఎంఏ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని, వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో వైద్యులు కృష్ణప్రసాద్, రంగారావు, కనకరాజు, అయ్యప్ప రాజశేఖర్, అరకల భాస్కర్‌రావు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ల జారీకి క్యాంపులు

ఖమ్మంగాంధీచౌక్: పెన్షన్‌దారులకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు జారీ చేసేందుకు తపాలా శాఖ ఆధ్వర్యాన ఉమ్మడి జిల్లాలో ప్రత్యేకంగా క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ వి.వీరభద్రస్వామి తెలిపారు. ఖమ్మంలోని తపాలా డివిజన్ కార్యాలయంలో మంగళవారం వివరాలు వెల్లడించారు. ఏటా పెన్షన్‌దారులు ప్రభుత్వానికి డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాల్సి ఉంటుందని, రూ.70 నామమాత్రపు ఫీజుతో పోస్టాఫీసుల్లో సర్టిఫికెట్లు పొందే అవకాశముందని తెలిపారు. డివిజన్ పరిధిలోని పలు పోస్టాఫీసుల్లో ఈ సౌకర్యం ఉండగా, సర్టిఫికెట్ల జారీకి ప్రత్యేక క్యాంపులను కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నవంబర్ 4వ తేదీన ఖమ్మం హెడ్ పోస్టాఫీస్‌లో, 8న కొత్తగూడెం హెడ్ పోస్టాఫీస్‌లో, 16న ఖమ్మంలోని గాంధీచౌక్ సబ్ పోస్టాఫీస్‌లో, 25న భద్రాచలం పోస్టాఫీస్‌లో క్యాంపులు ఉంటాయని, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల పెన్షన్‌దారులు, ఈపీఎఫ్–95 పెన్షనర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ కోరారు.

స్పెషల్ టీచర్ల సర్టిఫికెట్ల పరిశీలన

కొత్తగూడెంఅర్బన్: డీఎస్సీ – 2024లో ఎంపికైన స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థుల(స్పెషల్ ఎడ్యుకేషన్) సర్టిఫికెట్లను స్థానిక డీఈఓ కార్యాలయంలో మంగళవారం పరిశీలించారు. హాజరైన అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువపత్రాలను పరిశీలించి, రెండు సెట్ల జిరాక్స్ కాపీలు తీసుకున్నారు. మొత్తం 20 మంది అభ్యర్థులు పరిశీలనకు హాజరయ్యారని డీఈఓ వెంకటేశ్వరా చారి తెలిపారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు ఎన్.సతీష్‌కుమార్, ఎస్‌కే సైదులు, ప్రధానోపాధ్యాయురాలు పద్మాలత, బి.వి.ఎల్. కుమార్, ఐఈఆర్పీలు సిద్దయ్య, నరేష్, ఆఫీస్ సిబ్బంది ప్రసాద్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేటీపీఎస్ ఉద్యోగుల ప్రతిభ


కళాకారులు, క్రీడాకారులను అభినందిస్తున్న సీఈ ఎం.ప్రభాకర్‌రావు

పాల్వంచ: ఈ నెల 24వ తేదీ నుంచి 26 వరకు జూరాలలో నిర్వహించిన జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ కల్చరల్, క్యారమ్స్ టోర్నమెంట్‌లో కేటీపీఎస్ 5, 6 దశల ఉద్యోగులు, ఆర్టిజన్ కార్మికులు ప్రతిభ కనబర్చారు. క్యారమ్స్‌లో రన్నరప్, కల్చరల్ గ్రూప్ నాటికలో 3వ బహుమతి సాధించారు. జానపద పాటల పోటీలో మసూద్ ప్రథమ, విచిత్ర వేషధారణలో రెండో బహుమతి, ఎంటర్‌టైనర్ అవార్డ్‌ను అందుకున్నారు. ఏకపాత్రాభినయంలో వీరమోహన్‌రావు ద్వితీయ బహుమతి సాధించారు. వీరిని మంగళవారం సీఈ ఎం.ప్రభాకర్‌రావు, ఎస్ఈలు ధర్మారావు, సత్యనారాయణ అభినందించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ సెక్రటరీ వీరస్వామి, కల్చరల్, క్యారమ్స్ క్రీడాకారులు వీరమోహన్‌రావు, మసూద్, రమేశ్, కృష్ణ, రాములు, శారద, చంద్రశేఖర్, శ్రీను, సునీల్ రెడ్డి, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల రాజశేఖర్‌కు యంగ్ ఇండియన్ అవార్డు


మొక్కల రాజశేఖర్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

చుంచుపల్లి: హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన వివిధ రాష్ట్రాల నుంచి పలు రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారిని ఘనంగా సన్మానించి అవార్డులు ప్రదానం చేశారు. ఇటీవల 114వ మన్ కీ బాత్ కార్యక్రమంలో భారత ప్రధాని మోదీ నుంచి ప్రశంసలు అందుకున్న కొత్తగూడెంనకు చెందిన ప్రకృతి ప్రేమికుడు మొక్కల రాజశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్, టీజీఓల స్టేట్ ప్రెసిడెంట్ ఏలూరి శ్రీనివాసరావు, ఫౌండేషన్ సలహాదారులు వెంకట పుల్లయ్య, సంస్థ వ్యవస్థాపకులు జేబీ బాలు పాల్గొన్నారు. కాగా, రాజశేఖర్‌ను సింగరేణి సెంట్రల్ వర్క్‌షాప్ జీఎం దామోదర్, సింగరేణి ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాజీవ్‌కుమార్, లగడపాటి రమేశ్‌చందు, గుండపనేని సతీశ్, తూముల శ్రీనివాస్, సుగుణారావు, దస్తగిరి అభినందించారు.

భూగర్భ జలాలను కాపాడుకోవాలి

ములకలపల్లి: భూగర్భ జలాలను కాపాడుకోవాలని, లేనిపక్షంలో భవిష్యత్ తరాలు తీవ్ర నీటిఎద్దడిని ఎదుర్కోవాల్సి వస్తుందని జిల్లా భూగర్భ జల అధికారి, ములకలపల్లి మండల ప్రత్యేకాధికారి రమేశ్ తెలిపారు. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో మంగళవారం 'భవిష్యత్ తరాల కోసం సుస్థిర భూగర్భ జల వనరులు'అనే అంశంపై నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్ట్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ఇచ్చారు. ఎంపీడీఓ మహాలక్ష్మి, లక్ష్మయ్య, సునీత, తిరుపతి, ప్రశాంత్, నాగబ్రహ్మాచారి పాల్గొన్నారు.

కొంటారా.. వదిలేస్తారా?!

- జాడలేని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు
- నాణ్యత పేరిట వ్యాపారుల నిలువుదోపిడీ
- పెట్టుబడి కూడా రావడం లేదని రైతుల ఆవేదన
- ఉమ్మడి జిల్లాలో 88 వేలకు పైగా ఎకరాల్లో పంట సాగు


కొమరారం వైకుంఠధామంలో మొక్కజొన్నలపై పట్టా కప్పుతున్న రైతులు

ఇల్లెందురూరల్: వాతావరణం అనుకూలించలేదు.. చీడపీడలు నీడలా వెంటాడాయి.. ఆపై అధిక వర్షాలు ఇబ్బంది పెట్టాయి.. అయినా చెమటోడ్చి మొక్కజొన్న సాగు చేసిన రైతులను దోచుకోవడంలో ఇప్పుడు దళారులు తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. అతివృష్టితో భగవంతుడు రైతుల ఆశలపై నీళ్లు చల్లగా.. దళారులు ధరలో దగాతో వారి శ్రమను దోచుకుంటున్నారు. ఇదంతా తెలిసినా ప్రభుత్వ పరంగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయకపోవడంతో పెట్టుబడి కూడా రావడం లేదని రైతులు దిగులు పడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

భద్రాద్రి జిల్లాలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం అధికారిక గణాంకాల ప్రకారం 85,823 ఎకరాలుగా నమోదైంది. కానీ పట్టాలు లేని రైతులు సాగుచేసిన సుమారు 5వేల ఎకరాలు కలిపితే మొక్కజొన్న సాగు విస్తీర్ణం సుమారు 90వేల ఎకరాలుగా ఉంటుంది. ఇక ఖమ్మం జిల్లాలో 2,300 ఎకరాల్లో సాగైనట్లు అంచనా. అయితే, అనధికారికంగా లెక్కేస్తే ఉమ్మడి జిల్లాలో మొక్కజొన్న సాగు లక్ష ఎకరాలు దాటుతుందని చెబుతున్నారు. సాధారణంగా మొక్కజొన్న ఖరీఫ్‌లో ఎకరానికి 25 క్వింటాళ్లు, రబీలో 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. కానీ ఈ దఫా వాతావరణ పరిస్థితులు అనుకూలించని కారణంగా ఎకరాకు 10 క్వింటాళ్ల నుంచి 15 క్వింటాళ్లు దాటడం లేదని రైతులు చెబుతున్నారు. ఎకరానికి 15 క్వింటాళ్ల చొప్పున లెక్కించినా 90 వేల ఎకరాల నుంచి 13.50 లక్షల క్వింటాళ్ల మొక్కజొన్న మార్కెట్‌కు చేరే అవకాశం ఉంది.

దెబ్బమీద దెబ్బ..

ఖరీఫ్ ఆరంభంలో వర్షాభావంతో విత్తనాలు మొలకెత్తలేదు. దీంతో రెండో సారి విత్తనాలు వేయాల్సి రావడంతో పెట్టుబడి ఖర్చు పెరిగింది. ఇక మొక్క ఎదుగుతున్న దశలో వర్షాభావం.. ఆ తర్వాత అధిక వర్షాలు కోలుకోకుండా చేశాయి. కంకి పాలుపోసే, గింజ పక్వానికి వచ్చే దశల్లో ప్రతికూల వాతావరణ పరిస్థితులు మొక్కజొన్న దిగుబడిపై ప్రభావం చూపాయి. దీంతో ఎకరాకు కనీసం 20 క్వింటాళ్లకు బదులు పది నుంచి 15 క్వింటాళ్ల దాటలేదని రైతులు వాపోతున్నారు. ఓ పక్క పెట్టుబడి పెరగగా సరైన దిగుబడి లేకపోవడం వారిని కుంగదీస్తోంది.

జాడలేని కొనుగోలు కేంద్రాలు..

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏటా అక్టోబర్ చివరి వారంలోనే ఏర్పాటు చేస్తుంది. దీంతో రైతులు ఆశతో తేమ తగ్గేలా మొక్కజొన్నలను కల్లాలు, రహదారులపై ఆరబెట్టారు. అయితే, కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ఎలాంటి ప్రకటన లేకపోవడం గమనార్హం. ఈసారి ప్రభుత్వం మొక్కజొన్న మద్దతు ధర క్వింటాకు రూ.2,225గా నిర్ణయించింది. కానీ ప్రభుత్వ పరంగా కేంద్రాలు ఏర్పాటుకాకపోవడంతో చాలా మంది రైతులు బయట వ్యాపారులకు విక్రయిస్తున్నారు. క్వింటా రూ.2,300 చెల్లిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నా.. హమాలీ, ట్రాక్టర్ కిరాయి, తరుగు కోతలు లెక్కిస్తే రైతులకు క్వింటాకు రూ.2వేలు కూడా దక్కడం లేదు.

అడుగడుగునా మోసం..

ఏజెన్సీ ప్రాంత రైతులను ధరతోపాటు తూకంలోనూ


రైతులు ఆరబెట్టిన మొక్కజొన్న రాశులు

వ్యాపారులు మోసం చేస్తున్నారు. నేటికీ రాళ్లబాట్లు, ముళ్ల త్రాసులతో మొక్కజొన్న కాంటావేస్తూ అన్నదాత శ్రమను దోచుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ముళ్ల త్రాసుతో తూకం వేయడంతో రైతులు క్వింటాకు సగటున కిలో చొప్పున నష్టపోతారని, మొత్తంగా చూస్తే ఇది భారీగా ఉంటుందని చెబుతున్నారు. అయితే మొక్కజొన్న విక్రయాలు ఇప్పటికే 50 శాతం దాటాయని..ఇకనైనా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయకపోతే వ్యాపారులకు తప్ప రైతులకు ప్రయోజనం ఉండదనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ఎప్పుడు ఏర్పాటు చేస్తరో..



ఐదెకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాను. పంట విక్రయం కోసం గతంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్దకు చేర్చాను. తేమ శాతం మెరుగ్గా ఉండేలా ఆరబెట్టుకుంటున్నాను. ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు ఏర్పాటు చేస్తుందో ఇంకా తెలియడం లేదు.

– గుగులోత్ మంగీలాల్, రైతు, కొమరారం, ఇల్లెందు మండలం

దిగుబడి భారీగా తగ్గింది



అతివృష్టి, అనావృష్టి కారణంగా దిగుబడి భారీగా తగ్గింది. గతంలో ఎకరానికి 25 క్వింటాళ్లు వచ్చేది. కానీ ఈసారి 15 క్వింటాళ్లు కూడా దాటలేదు. బహిరంగ మార్కెట్‌కు పంట తీసుకెళ్తే దళారులు, వ్యాపారులు మోసం చేస్తారనే భయం వేస్తోంది. అందుకే ప్రభుత్వ కొనుగోలు కేంద్రం కోసం ఎదురుచూస్తున్నాం.

– భూక్యా చిన్నా , రైతు, కొమరారం, ఇల్లెందు మండలం

కలెక్టరేట్ ఎదుట ఆందోళనలు


కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఏఈఓలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్రంలో ట్రైకార్ సబ్సిడీ నిధులను విడుదల చేసి నూతన యాక్షన్ ప్లాన్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఏఓ రమాదేవికి వినతిపత్రం అందజేశాక సంఘం జిల్లా ఇన్‌చార్జ్ కల్లూరి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధానకార్యదర్శి భూక్య శ్రీనివాస్ మాట్లాడారు. గిరిజన సంక్షేమ శాఖ ట్రైకార్ నుంచి 2017–18 నుంచి 2020 వరకు 32,122 మంది లబ్ధిదారులకు రుణాలు సుమారు రూ.265 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే విడుదల చేసే విధంగా ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సోంది కుటుంబరావు, గోవిందు, లక్ష్మయ్య, నగేశ్, సత్యనారాయణ, చందర్, వెంకటేశ్వర్లు, శంకర్, నరేశ్, శ్రీనివాస్, జానకిరామ్, విజయ్, రమేశ్, శివాజీ, చక్రవర్తి పాల్గొన్నారు. కాగా, తమ సమస్యలను పరిష్కరించాలని, రాష్ట్రవ్యాప్తంగా 80 మంది ఏఈఓలపై విధించిన సస్పెన్షన్ ఉత్తర్వులను తక్షణమే వెనక్కి తీసుకోవాలని కోరుతూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఏఈఓలు నిరసన వ్యక్తం చేశారు. రైతు వేదికల్లో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో నల్లబ్యాడ్జీలు పెట్టుకుని విధులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బందెల నరసింహారావు, ప్రధాన కార్యదర్శి సందీప్ మాట్లాడుతూ.. బుధవారం రాష్ట్రస్థాయిలో జరిపే చర్చల్లో సమస్యలు పరిష్కారం కాకపోతే పెన్‌డౌన్ నిర్వహిస్తామని హెచ్చరించారు.

జైలును పరిశీలించిన న్యాయమూర్తి

ఇల్లెందు: స్థానిక సబ్‌జైలును ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి దేవరపల్లి కీర్తిచంద్రిక రెడ్డి మంగళవారం సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. మెనూ అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు ఆర్థిక స్థోమత లేక న్యాయ సహాయం పొందని వారికి ఫ్రీ లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. అలాంటి అవసరం ఉన్న ఖైదీలు సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. న్యాయమూర్తి వెంట జైలు అధికారి ఎస్.చంద్రశేఖర్, సిబ్బంది శ్రీనివాస్, సాంబ, దుదియా, లీగల్ ఎయిడ్ న్యాయవాది కీర్తికార్తీక్ తదితరులు ఉన్నారు.

అధిక ధరకు మద్యం విక్రయాలు

ఇల్లెందు: జిల్లాలో అధిక ధరలకు మద్యం విక్రయాలు సాగుతున్నాయని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేశ్‌నాయక్ ఆరోపించారు. మంగళవారం ఇల్లెందు ఆబ్కారీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. భద్రాచలం ఎక్సైజ్ శాఖ కార్యాలయం పరిధిలోని మండలాల్లో నిబంధనలకు విరుద్ధంగా గోదాంలో అమ్మకాలు సాగుతున్నట్లు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో భూక్యా శ్రీనునాయక్, వెంకటేశ్‌నాయక్, నాగరాజునాయక్, రమేశ్ నాయక్, రాంబాబునాయక్ తదితరులు ఉన్నారు.

పోస్టల్ రిజిస్టర్ లెటర్లు రోడ్డుపై ప్రత్యక్షం..


రోడ్డుపై పడిన ఏటీఎం, పాన్‌కార్డులు, రిజిస్టర్ లెటర్లు

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో కె.దంతెనం గ్రామానికి చెందిన పోస్టల్ రిజిష్టర్ లెటర్లు (పోస్టు ద్వారా వచ్చిన వాటిని ప్రజలకు అందించాల్సినవి) రోడ్డుపై కనిపించాయి. కె.దంతెనం గ్రామానికి చెందిన మోతుకూరి పద్మ, మారెళ్ల అలివేలు, కొత్త ఆదెమ్మకు చెందిన ఏటీఎం కార్డులు, పూజారి దేవహర్షిణి, డేగల కుమారికి చెందిన పాన్‌కార్డుల రిజిస్టర్ లెటర్లు లక్ష్మీనగరం గ్రామంలో ఓ బాటసారికి దొరికాయి. కాగా సదరు వ్యక్తి వాటిని బ్యాంకుకు చెందినవి అని గుర్తించి బ్యాంకు సిబ్బందికి అందచేశాడు. అనంతరం తపాలాశాఖలో పనిచేసే ఓ వ్యక్తి బ్యాంకుకు వ్యక్తిగత పనిమీద వెళ్లడంతో బ్యాంకు సిబ్బంది వాటిని అతడికి అందించగా.. ఆయన దుమ్ముగూడెం సబ్ పోస్ట్ మాస్టర్‌కు అందజేశాడు. ఈ ఘటనతో తపాలాశాఖ అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై భద్రాచలం పోస్టల్ శాఖ ఏఎస్పీ అశోక్‌కుమార్‌ను వివరణ కోరగా తక్షణమే సంబంధిత వ్యక్తులకు ఆ రిజిస్టర్ లెటర్లను అందిస్తామని, అవి రోడ్డుపై ఎవరు పడేశారని అంశంపై విచారణ చేపడుతామని చెప్పారు.

వార్డెన్ వేధింపులు తాళలేక వర్కర్ల ఆందోళన

మణుగూరుటౌన్: మండలంలోని అశోక్‌నగర్ ఎస్సీ బాలుర హాస్టల్ వార్డెన్ వేధింపులు తాళలేక వర్కర్లు హాస్టల్ ముందు బైఠాయించిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వర్కర్లు సువర్ణారావు, జ్యోతి, సమ్మక్క, సరోజ కథనం ప్రకారం.. వార్డెన్ శ్రీనివాస్ గ్యాస్ అయిపోయిందని చెబితే గ్యాస్ తింటున్నారా అంటూ కట్టెల పొయ్యిపై వండాలని వేధిస్తున్నాడని, స్థానికంగా ఉండకుండా భద్రాచలం నుంచి వస్తూ తాళం పిల్లల వద్ద ఉంచి, వారితోనే రిజిస్టర్లు రాయిస్తూ చీటికి మాటికి బియ్యం, సరుకులు మాయమయ్యాయని దుర్భాషలాడుతున్నాని తెలిపారు. ఎవరైనా అధికారులు తనిఖీ చేసేందుకు వస్తే విద్యార్థులు 90 – 100 మంది ఉంటున్నారని చెప్పాలని ఒత్తిడి చేస్తున్నాడని, కళాశాల, పాఠశాల విద్యార్థులకు వేర్వేరుగా వండాలని, ఉదయం, మధ్యాహ్నం హాస్టల్‌కి వచ్చి విద్యార్థులకు వండి పెట్టాలని ఇబ్బంది పెడుతున్నాడని ఆరోపించారు. వార్డెన్ తీరుపై జిల్లా అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేశామని అయినా ఆయనలో మార్పు రాకపోవడంతో బైఠాయించామన్నారు. విషయం తెలుసుకున్న భద్రాచలం ఏఎస్‌డబ్ల్యూఓ హనుమంతరావు వర్కర్లతో ఫోన్‌లో మాట్లాడి వార్డెన్‌పై చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చి ఆందోళన విరమింపజేశారు.

అదుపుతప్పి కారు బోల్తా

జూలూరుపాడు: గంగారంతండా సమీపంలో మంగళవారం కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటన చోటుచేసుకుంది. చంద్రుగొండ నుంచి జూలూరుపాడు వైపు అతివేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి బోల్తాకొట్టి రోడ్డుపక్క ముళ్లపొదల్లో పడింది. కారుడ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాకుండా బయటపడ్డాడు. బోల్తాపడిన కారును స్థానికులు లేపారు. కారులో డ్రైవర్ తప్ప ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

బెల్లం, పటిక పట్టివేత

జూలూరుపాడు: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి సారా తయారీకి సంబంధించిన బెల్లం, పటికను కొత్తగూడెం ఎక్సైజ్‌శాఖ సీఐ జయశ్రీ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. కరివారిగూడెం గ్రామ పంచాయతీ తవిసిగుట్టతండాకు చెందిన బోడా బాలు జూలూరుపాడు నుంచి టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై వెళ్తుండగా ఆపి తనిఖీ చేశారు. అతని వద్ద 10 కేజీల బెల్లం, కేజీ పటిక దొరికింది. బాలును విచారించగా మణికంఠ కిరాణా దుకాణంలో కొనుగోలు చేసినట్లు చెప్పడంతో ఎక్సైజ్‌శాఖ అధికారులు ఆ దుకాణంలో తనిఖీలు చేశారు. సారా తయారీకి ఉపయోగించే 169 కేజీల బెల్లం, 20 కేజీల పటికను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 179 కేజీల బెల్లం, 21 కేజీల పటిక స్వాధీనం చేసుకోవడంతోపాటు ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశారు. నిందితులు బాలు, మణికంఠను అదుపులోకి తీసుకున్నారు.

కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: కత్తితో అన్నయ్యపై దాడికి పాల్పడిన తమ్ముడిపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ యయాతిరాజు కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని భగత్‌సింగ్ సెంటర్‌కు చెందిన పోతనబోయిన దినేశ్‌పై అతని తమ్ముడు రవి ఆదివారం రాత్రి కత్తితో దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. తీవ్రంగా గాయపడిన దినేశ్ ఆస్పత్రిలో చికిత్స పొందిన తర్వాత లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా రవిపై నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పూరిల్లు దగ్ధం

ములకలపల్లి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని తిమ్మంపేట జీపీ తుమ్మలకుంటలో మంగళవారం చోటుచేసుకుంది. ఒగ్గెల రాజాకు చెందిన పూరిల్లు నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో, కుటుంబీకులు ఇంటి నుంచి బయటకు పరుగులు తీశారు. ఇరుగుపొరుగువారు గమనించి, మంటలను ఆర్పేలోగానే ఇల్లంతా కాలిపోయింది. నిత్యావసర వస్తువులు, సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత కుటుంబం కోరుతోంది.

వివాహిత ఆత్మహత్య

పాల్వంచరూరల్: వివాహిత పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని దంతలబోరు జీపీ గంగాదేవిగుప్పలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మోసం స్వప్న (25) చేనుకు వెళ్లి అక్కడే పురుగులమందు మృతి చెందింది. ఐదు నెలల కిందట దుమ్ముగూడెం మండలం కమలాపురం గ్రామానికి చెందిన కొముురం చంటితో స్వప్నకు వివాహమైంది. ఆదివారం అత్తగారి ఇంటి నుంచి వచ్చిందని, భర్త ఇష్టంలేని కారణంగా తమ కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

సింగరేణి ఉద్యోగం సాధించిన ఆటోడ్రైవర్ కుమార్తె

జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రెయినీగా ఎంపిక


నందిని

సుజాతనగర్: ఓ ఆటోడ్రైవర్ కుమార్తె తాను కన్న కలను ఎట్టకేలకు సాధించింది. సింగరేణిలో జేఎంఈటీ గ్రేడ్-3(జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రెయినీ) నిర్వహించిన పరీక్ష ఫలితాలు తాజాగా వెల్లడించగా ఆ యువతి టాపర్‌గా నిలిచింది. వివరాలిలా ఉన్నాయి. సుజాతనగర్‌కు చెందిన వేల్పుల భాస్కర్, వేణమ్మ దంపతులకు కుమారుడు సంతోష్, కుమార్తె నందిని ఉన్నారు. భాస్కర్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నప్పటికీ ఇద్దరు పిల్లలను ఉన్నత స్థితికి చేర్చాలనే తపనతో వచ్చే కొద్దిపాటి ఆదాయంతోనే వారిని చదివించాడు. దీంతో సంతోష్ బీటెక్ చివరి సంవత్సరం చదువుతుండగా నందిని మైనింగ్ డిప్లొమా పూర్తిచేసింది. ఈ ఏడాది ఆగస్టులో సింగరేణి నిర్వహించిన పరీక్షకు ఆమె హాజరైంది. ఈ నేపథ్యాన తాజాగా వెల్లడైన ఫలితాల్లో ముందు వరుసలో నిలిచిన నందిని జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రెయినీగా ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమె తల్లిదండ్రులు, బంధువులు ఆనందం వ్యక్తం చేయగా.. అమ్మానాన్నల ప్రోత్సాహంతోనే ఉద్యోగం సాధించినట్లు నందిని వెల్లడించింది.

ఫిట్టర్‌గా నిమ్మగూడెం వాసి..


నరేష్

మండలంలోని నిమ్మలగూడెంకు చెందిన ఉప్పిరాల వెంకటేశ్వర్లు – రత్తమ్మ దంపతుల కుమారుడు నరేష్ సింగరేణిలో ఫిట్టర్‌గా ఉద్యోగం సాధించాడు. నరేష్ తండ్రి మల్టీపర్పస్ కార్మికుడిగా, తల్లి వ్యవసాయ కూలీ పనులు చేస్తూ కుమారుడిని చదివించారు. హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూనే సింగరేణి పరీక్షకు ఎంపికైన ఆయన 83.33శాతం మార్కులతో ఉద్యోగానికి ఎంపికయ్యాడు.